నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూబ్లీ గార్డెన్ రోడ్డు నంబర్ 6,7,అపర్ణ, వాసవి కన్‌స్ట్రక్షన్స్, రవి ఎన్‌క్లేవ్, మీనాక్షి టవర్స్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాతా భువనేశ్వరీ కాలనీ, ఇజ్జత్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

657 మంది కొత్త రేషన్‌కార్డులకు అర్హులు

ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: సర్కిల్ 21 పరిధిలోని నాలుగు డివిజన్లలో మంగళవారం గ్రామ సభలు నిర్వహించామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, మాదాపూర్ డివిజన్‌లలో కులగణన సర్వే ఆధారంగా 2,236 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించగా 657 మంది రేషన్‌కార్డులకు అర్హులని తేలిందన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆయా వార్డు కార్యాలయాలలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రేషన్ కార్డు తుది జాబితాను సర్కిల్ 21 పరిధిలోని వివిధ వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 26వ తేదీన అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తామన్నారు.

రేపు 'వీక్షిత్ భారత్-2047' సమావేశం

రాయదుర్గం: యూనివర్సిటీలోని మహిళా హౌజ్ కీపింగ్, ఇతర సిబ్బందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి మనూలో 'వీక్షిత్ భారత్- 2047' కోసం సామాజిక చేరిక' పేరిట ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ఎస్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ డానిష్‌మోయిన్ మంగళవారం తెలిపారు. 'మనూ'లోని అల్-బెరూని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ (సీఎస్ఎస్ఐ) ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఆయా కార్యక్రమాలను యూజీసీ సూచన మేరకు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సరుకులు పంపిణీ



ఆల్విన్‌కాలనీ: ఎస్‌జీఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ సిబ్బంది మంగళవారం ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ప్లేట్లు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా వృద్ధులకు వస్తువులు అందజేయటం సంతృప్తిగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ధీర యోగి, సౌమ్య, రఘు, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ బి.పుష్ప వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నగేష్ పాల్గొన్నారు.

16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ. 2 వేలు జరిమానా, అదేవిధంగా 11 మందికి రూ. 1500, మరో ముగ్గురికి వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు రోడ్ సేఫ్టీ ర్యాలీ

మణికొండ: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహనా ర్యాలీని నిర్వహిస్తున్నట్టు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.



పార్కులో పగిలిన బండలు



కూకట్‌పల్లి రంగధాముని చెరువు వద్ద లేక్‌ఫ్రంట్ పార్కు ప్రవేశ ద్వారం

పట్టించుకునేవారు లేక..

అధ్వానంగా లేక్ ఫ్రంట్ పార్కు

మూసాపేట: పట్టించుకునేవారు లేక లేక్ ఫ్రంట్ పార్కు అస్తవ్యస్తంగా తయారైంది. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏర్పాటైన సంవత్సరంలోపే ఫ్యూజ్ బాక్సులకు మూతలు లేకపోవటం, లేక్ ఫ్రంట్ పార్కు గేటు విరిగిపోవటం, బండలు పగిలిపోవటం లాంటి సమస్యలు ఏర్పడ్డాయి. నిర్వహణ ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మరింత శిథిలం కానున్నది.





పార్కులో మద్యం బాటిళ్లు, చెత్త

- పార్కులో ఉన్న 18 ఫ్యూజ్ బాక్స్‌లకు మూతల్లేవు. 5 సంవత్సరాలలోపు చిన్నారులకు సైతం తేలికగా అందే ఎత్తులో బాక్స్‌లు ఉన్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- బోర్ మోటార్ బాక్స్ కూడా పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. బోర్ ఉన్న గుంత తెరిచి ఉంచటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- బండలు పగిలిపోయి నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. పక్కనే పెద్ద చెరువు, బోరు ఉన్నా పార్కులో చెట్లు మాత్రం ఎండిపోయాయి. ఇక పార్కులో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన గడ్డి కూడా ఎండిపోయింది.
- సాయంత్రం వేళ ఈ పార్కుకు ప్రజల రాకపోకలు ఎక్కువ. ఇక రాత్రి సమయంలో మందుబాబులు తిష్ట వేసి మద్యం తాగి బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్స్







పార్కులో బోరు ఉన్నా ఎండిపోతున్న మొక్కలు, గడ్డి

మనూలో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: సుస్థిర అభివృద్ధి ప్రయత్నాలకు మేధస్సు కేంద్ర బిందువు అని కోల్‌కతా విశ్వ భారతి సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బిద్యుత్‌చక్రవర్తి అభిప్రాయపడ్డారు .గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'మెరుగైన ప్రపంచం కోసం సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్:రోల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరత, మానవ మేధస్సు ప్రాథమిక సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. 'మనూ' ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షగుఫ్తాషాహిన్ మాట్లాడుతూ ఆచరణాత్మక అంశాలను దృష్టిలో ఉంచుకుంటే స్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో 'మనూ' ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొ.బిద్యుత్‌చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

దోమల నివారణకు చర్యలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు, జయానగర్ కాలనీవాసులు దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన మంగళవారం ఎంటమాలజీ సిబ్బందితో కలిసి చెరువులో ఎంఎల్ఓ ఆయిల్‌బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువులో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించి చెరువుని శుభ్రం చేసే విషయమై శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, రాజేష్, పోశెట్టి గౌడ్, శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లమ్మ చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

బీజేపీ బలోపేతమే లక్ష్యం

గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్

రాయదుర్గం: బీజేపీని గచ్చిబౌలి డివిజన్‌లో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని గచ్చిబౌలి డివిజన్ నూతన అధ్యక్షుడు శివాసింగ్ తెలిపారు. మంగళవారం నానక్‌రాంగూడలో బీజేపీ నాయకులు శివాసింగ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మీన్‌లాల్, శ్రీకాంత్‌రెడ్డి, బబ్లూసింగ్, అనంత్‌రెడ్డి, గోపాల్, రమేష్, సంకేష్‌సింగ్, ఉమేష్, జితేందర్‌సింగ్, సతీష్‌సింగ్, విఠల్ పాల్గొన్నారు.



శివాసింగ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23న నిర్వహిస్తున్నట్టు రంగారెడ్డి జిల్లా జోనల్ అధికారి భీమయ్య మంగళవారం తెలిపారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలని, దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు నంబర్, బర్త్ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటో జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



వెస్ట్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ ఎం.రవి కుమార్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆయన జడ్‌సీతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఆయా డివిజన్లలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అంతర్గత రోడ్లను తక్షణమే అభివృద్ధి చేయాలని కోరారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, రోడ్ల విస్తరణ చేపట్టాలని తెలిపారు. సమస్యలపై పరిష్కారంపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు.

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందిస్తాం : పీఏసీ చైర్మన్ గాంధీ

చందానగర్: రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తామని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో అర్హుల తుది జాబితాను విడుదల చేసి నూతన రేషన్ కార్డుల దరఖాస్తులను కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ 21 అధికారులు, కాంగ్రెస్ నేత రఘునాథ్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ డివిజన్ వార్డు కార్యాలయంలో వార్డు సభను కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందొద్దని, అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.



చందానగర్ డివిజన్ .. వార్డు సభలో మహిళ నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యాదగిరిగౌడ్, నరేందర్‌గౌడ్, సత్తార్, సయ్యద్ తహెర్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్‌లో..

మియాపూర్: ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీపై మియాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. రేషన్ కారులు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఈ నెల 24వ తేదీ వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డీసీ మోహన్‌రెడ్డి, అధికారులు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ధర్నా

- చిత్తాపూర్- సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ఆలస్యంపై ఆగ్రహం
- 9 మందిపై కేసులు నమోదు

శేరిలింగంపల్లి: ప్రతి రోజూ రైలు ప్రయాణంలో ప్రతి రోజూ జాప్యం జరుగుతుండటంతో అసంతృప్తికి లోనైన రైల్వే ప్రయాణికులు లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు సమీపంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రయాణికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిత్తాపూర్- సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ప్రతి రోజూ రెండు గంటల ఆలస్యంగా వస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. లింగంపల్లి స్టేషన్‌కు 7.35 నిమిషాలకు రావాల్సిన రైలు 8.35 నిమిషాలకు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ హోమ్ సిగ్నల్ వద్ద రైలు నిలవగానే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో కిందకు దిగి నిరసనకు చేపట్టారు. చిత్తాపూర్- సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు ప్రయాణంలో జాప్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రైల్వే అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు, రైల్వే అధికారుల వారికి నచ్చ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.



లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

పలువురిపై కేసులు నమోదు

లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చిత్తాపూర్-సికింద్రాబాద్ ప్యాసింజర్‌ను అడ్డుకున్నందుకు గాను ఆర్‌పీఎఫ్ పోలీసులు 9 మందిపై కేసులు నమోదు చేశారు. వారు ఏం జరుగుతుందోనని అక్కడికి వెళ్తే తమపై కేసులు పెట్టారని ప్రయాణికుల బంధువులు అసహనం వ్యక్తం చేశారు.

రైళ్ల రాకపోకల్లో ఆలస్యం..

ప్రయాణికుల ఆందోళన కారణంగా లింగంపల్లి స్టేషన్ మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. దీంతో ఎంఎంటీఎస్ రైళ్లు, బీదర్ ఇంటర్ సిటీ, పూర్ణ ప్యాసింజర్, వికారాబాద్ ప్యాసింజర్ తదితర రైళ్ల రాకపోకల్లో జాప్యంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

25న భారీ బహిరంగ సభ

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 25న జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య కోరారు. మంగళవారం ప్రచార జాత పటాన్‌చెరుకు వచ్చిన సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ దగ్గర జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... సీపీఎం రాష్ట్ర నాలుగవ మహాసభ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు నిర్ణయించే మహాసభలన్నారు. సామాజిక ,రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై లోతుగా విశ్లేషిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పోరాట యోధులు, ప్రజా సమస్యలపై నిరంతర పోరాడే నాయకులు హాజరవుతున్నారని అన్నారు. పాలకులు ప్రజల సమస్యలు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. సంగారెడ్డిలో మొదటి రోజు ఐబి నుంచి వేలాది మందితో భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, సీపీఎం ఏరియా నాయకులు పాండురంగారెడ్డి, సదాశివరెడ్డి, మూర్తి, రాజు, యేసు, సత్తిరాజు, చక్రధర్, రాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 69.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, చైర్‌పర్సన్ రోజా బాల్ రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... బొల్లారంలో 26 కోట్ల రూపాయలతో మిషన్ భగీరథ రిజర్వాయర్లు, సంపులకు పైప్‌లైన్ల కనెక్షన్లను ఇవ్వడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని వివరించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 42 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 22 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్ రెడ్డి, కమిషనర్ మంగతాయారు, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ స్థలాలు, చెరువు బఫర్‌జోన్‌లు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, నాలాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోడల్ అధికారి గణపతి పేర్కొన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాస్ కాలనీకి ఆనుకొని వున్న అంబీర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ కట్టడాన్ని జీహెచ్‌యంసీ కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. సంక్రాంతి పండుగ సెలవులు అదునుగా చెరువు స్థలాన్ని సైతం వదలకుండా భారీ షెడ్‌ను నిర్మించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు సర్కిల్ సిబ్బంది షెడ్డను కూల్చివేశారు.



రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు పరిరక్షించడమే ధ్యేయంగా హైడ్రాను ఏర్పాటు చేయటం జరిగింద, అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లెనిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గచ్చిబౌలి: కామ్రేడ్ లెనిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సుందర్య విజ్ఞాన కేంద్రం గంథ్రాలయ ఇన్‌చార్జ్ ఆర్.సాంబశివరావు తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ లెనిన్ 101వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే బాధ్యులు విజయ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- కాచారంలో గ్రామసభకు హాజరు

శంషాబాద్ రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని కాచారంలో ప్రజాపాలనలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల విషయమై ఎవరూ ఆందోళన చెందవద్దని..ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అలాగే అర్జీలు చేసుకోనివారు ఉంటే కొత్తగా మళ్లీ దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. కొత్త కార్డులతో పాటు పేర్ల మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకే మూడు రోజుల పాటు పంచాయతీలు, మున్సిపాలిటీలో గ్రామసభలు, వార్డు సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అర్హుల జాబితాను ఈ సభల్లోనే ప్రదర్శిస్తామని, వీటిపై సందేహాలు, అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని పేర్కొన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం అందుతుందన్నారు. భూమిలేని పేదలు జాతీయ ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండి 20 రోజులు పని చేస్తే ఏడాదికి రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఉన్న వారు, స్థలం లేని వారి జాబితాను వేర్వేరుగా ప్రకటిస్తామన్నారు. అలాగే గ్రామంలో ఆయా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను ప్రకటించారు. ఇన్‌స్పెక్టర్ కే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీఓ మున్నీ, ఎంపీఓ ఉషా, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ పి.గోపాల్ పాల్గొన్నారు.



కాచారం గ్రామ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి